ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకానికి నోటిఫికేషన్

మూసాపేట: ఫతేనగర్‌లోని శివాలయం, బాలానగర్‌లోని హనుమాన్ ఆలయాలకు ట్రస్టు బోర్డు నూతన సభ్యుల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేశామని దేవాదాయ శాఖ అధికారి అంజయ్య తెలిపారు. ఫిబ్రవరి 18వ తేదీలోపు ఆసక్తి ఉన్నవారు దేవాదాయ, ధర్మదాయశాఖ కమిషనర్‌కు లేదా అసిస్టెంట్ కమిషనర్‌కు కాని దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు.

మర్యాదపూర్వక కలయిక



క్రిస్టియన్ మైనార్టీ మాజీ చైర్మన్ రాజేశ్వరరావును కలిసిన ఆల్విన్‌కాలనీ పాస్టర్స్ నూతన కమిటీ సభ్యులు

భాగ్యనగర్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు రెవరండ్ రాజు, గౌరవాధ్యక్షుడు ఇశ్రాయేల్, ప్రధాన కార్యదర్శి ఎం. శ్యామ్ జాషువాలు ఎన్నికైన సందర్భంగా నూతన కమిటీ సభ్యులు క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజేశ్వర రావును శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిషప్ ఎం. శామ్యూల్, యు. ముఖేష్, ఎంఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఎస్ఆర్‌కు ఎంపికైన అపరాజితమిశ్రా

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థిని అపరాజితమిశ్రా ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ (ఐసీఎస్ఎస్ఆర్) డాక్టోరల్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. అంతేకాకుండా నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) కూడా క్వాలిఫైడ్ అయ్యారు. ఇటీవలే ఆమెకు పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆమె హెచ్‌సీయూ ప్రొ.శివప్రసాద్, డాక్టర్ అలోక్‌కుమార్ పాండే పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు పరిశోధక, ఇతర విద్యార్థులు అభినందించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఫెయిర్



కేర్ ఉడ్ స్కూలులో జరిగిన సైన్స్ ఫెయిర్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మూసాపేట: మూసాపేటలోని కేర్ ఉడ్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్‌ను కరస్పాండెంట్ రజనీశ్రీ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు జంతువులు, పక్షుల వేషధారణలో వాటి ప్రాముఖ్యతను తెలియజేశారు. పంటలు పండించే కష్టం విలువ, విధానం, వాటి ప్రాధాన్యతను తెలుపుతూ రైతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అంతేకాకుండా విత్తనాలు, మొక్కల ఎదుగుదల, పంటల రకాల గురించి పల్లెటూరు వాతావరణాన్ని తలపిస్తూ ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిథమ్ తాత్కాలిక డైరెక్టర్‌గా నిఖిలారెడ్డి

ప్రస్తుత డైరెక్టర్ డా.చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ జీఓ జారీ

రాయదుర్గం: నిథమ్ డైరెక్టర్ డాక్టర్ చిన్నంరెడ్డిని రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో తాత్కాలికంగా రాష్ట్ర పర్యాటక శాఖ డైరెక్టర్ ,టీఎస్‌టీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఐఏఎస్ అధికారి కె నిఖిలారెడ్డికి బాధ్యతలు అప్పగించారు. నూతన డైరెక్టర్ నాయకత్వంలో నిథమ్ పురోభివృద్ధి సాధిస్తుందని అధికారులు, ఉద్యోగులు స్పష్టం చేశారు.

హెచ్‌సీయూలో క్లీనప్ డ్రైవ్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలోని ఎన్ఎస్ఎస్ పార్కులో శనివారం 'క్లీనప్ డ్రైవ్' నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, శానిటేషన్, హార్టికల్చర్ విభాగం సిబ్బంది, డ్రైవ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ క్యాంపస్‌లో పచ్చదనం, పరిశుభ్రమైన వాతావరణం నెలకొనేలా చేయడంతో పూర్తిగా ఎన్ఎస్ఎస్ సెల్ సహకరిస్తుందన్నారు.హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ కృష్ణయ్య, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ భీంసింగ్, వాలంటీర్లు సుధాకర్, హరిప్రసాద్, ప్రకాశ్, యాదయ్య, శానిటేషన్ సిబ్బంది, విద్యార్థులు శ్రమదానం చేశారు.

హెచ్ఏఎల్ఈయూ ఐఎన్‌టీయూసీ నూతన కమిటీ

కూకట్‌పల్లి: హెచ్ఏఎల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐఎన్‌టీయూసీ యాన్యువల్ జనరల్ బాడీ సమావేశంలో నూతన కమిటీని ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి విజయారెడ్డి శనివారం ప్రకటించారు. సలహాదారులు గోపాలకృష్ణ, ఎ. సత్యనారాయణ, బషీరుద్దీన్, అధ్యక్షుడు మొహమద్ సిబ్గతుల్లాహ్, ప్రధాన కార్యదర్శి కర్క నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి. వెంకటపతి, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పోలేపల్లి శ్రీకాంత్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వాజీద్ ఆలీ, ఉపాధ్యక్షులు వీవీఎస్ రమేష్, నెహ్రూ, ఎస్.శ్యామసుందర్, కోశాధికారి బాబురావు, డిప్యూటీ కోశాధికారులు రావు, సీనియర్ జాయింట్ సెక్రటరీ లక్ష్మణ్, కరీంహిదాయతుల్లా, చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు మజాహర్, సుధాకర్, సీనియర్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అబ్దుల్ షుకూర్, పరశురామ్, టి. సురేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ హుస్సేన్‌ను ప్రకటించారు.

అక్షర అంతర్జాతీయ పాఠశాల వార్షిక మహోత్సవం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని అక్షర అంతర్జాతీయ పాఠశాల ఆవరణలో వార్షిక మహోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్జున అవార్డు గ్రహీత, ఇండియన్ ఎయిర్ పిస్టల్ షూటర్ ఈషా సింగ్, పాఠశాల చైర్మన్, అర్శనపల్లి జగన్మోహనరావు, పాఠశాల సీఈఓ అర్శనపల్లి మదన్‌మోహన్‌రావు, ఫైనాన్స్ డైరెక్టర్ రామారావులు విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ముందుగా విఘ్నేశ్వర ప్రార్థనా నృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈషా సింగ్ మాట్లాడుతూ... విద్యార్థి దశ, వారు మహోన్నత కీర్తి శిఖరాలు అందుకోవడానికి మొదటి సోపానం అవుతుందన్నారు. విద్యతో పాటు పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు, లలిత కళలు అలవర్చుకోవటం ముఖ్యమన్నారు.





చేనేతతో..అందం, ఆరోగ్యం

- శిల్పారామంలో గాంధీ బంకర్ మేళా
- ప్రత్యేక ఆకర్షణగా ఖాదీ ఉత్పత్తులు
- రోజు ఉదయం 10.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు
- రోజు సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు
- 8వ తేదీ వరకు అందుబాటులో..



శిల్పారామంలో నిర్వహిస్తున్న మేళాలో చేనేత ఉత్పత్తులు

మాదాపూర్: చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో డెవలప్‌మెంట్ కమిషనర్ హ్యాండ్‌లూమ్స్, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సంయుక్త నిర్వహణలో ఏర్పాటు చేసిన నేషనల్ హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పో గాంధీ బంకర్ మేళాకు మంచి స్పందన వస్తోంది. చేనేత వస్త్రాలు అందంతో బాటు శరీరానికి కావల్సిన చల్లదనాన్ని ఇస్తాయనేది విదితమే. నేత దుస్తులు హుందాతనాన్ని కూడా ఇస్తాయి. దీంతో ప్రజలు విరివిగా కొనుగోలు చేస్తున్నారు. ఈ మేళాలో మహిళలకు కావాల్సిన ప్రత్యేక డిజైన్‌లను ఆర్డర్‌పై సైతం అందిస్తున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు మేళా అందుబాటులో ఉంటుందని, అలాగే ప్రతి రోజు సాయంత్రం ఆంఫీ థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఈనెల 8వ తేదీ వరకు ప్రదర్శన ఉంటుందని తెలిపారు. దాదాపు 50కిపైగా స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి. ఉప్పాడ, పోచంపల్లి, గద్వాల్ గొల్లభామ, బెంగుళూరు సిల్క్, కొస పట్టు, కాటన్ బెడ్‌షీట్స్ అందుబాటులో ఉన్నాయి. మేళాలో భాగంగా రోజు సాయంత్రం 5.30 గంటలకు కూచిపూడి, భరతనాట్యం, ఒడిస్సీ, సంగీత కచేరీ ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకుంటున్నారు.

చీరలు ఎక్కువగా అమ్ముడవుతున్నాయి..



నగరవాసులు చేనేత చీరలను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ప్రత్యేక డిజైన్‌లు అందుబాటులో ఉన్నాయి. చేనేత వస్త్రాల వల్ల చర్మవ్యాధులు రాకుండా ఉంటాయి. హుందాగా, ఆరోగ్యంగా ఉంటారు. సందర్శకులకు కావాల్సిన డిజైన్‌లను ఆర్డర్‌లపై కూడా అందిస్తాం.

–కళావతి స్టాల్ నిర్వాహకురాలు

సర్వైకల్ కేన్సర్ నివారణకు కృషి

ఉచితంగా పాఠశాల బాలికలకు వ్యాక్సిన్

ఆల్విన్‌కాలనీ: ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా శనివారం రాందేవ్‌రావ్ ఆస్పత్రి దత్తత తీసుకున్న 9 నుంచి 15 సంవత్సరాలలోపు పాఠశాలలోని బాలికలకు సర్వైకల్ కేన్సర్ నివారణ కోసం ఉచితంగా వ్యాక్సిన్ అందజేశారు. ప్రతి బుధవారం, శనివారం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా 18 నుంచి 45 సంవత్సరాలలోపు ఉన్న రాందవేరావు ఆస్పత్రి సిబ్బందికి కూడా ఉచితంగా మూడు డోసుల సర్వైకల్ కేన్సర్ వ్యాక్సిన్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా బాచుపల్లికి చెందిన మెరుగు సుచరిత తన తల్లి విజయవాణి, పిల్లలు నిషిత్, నియతి పేర్ల మీద ఇటువంటి సేవలు మరింత మందికి అందించాలనే ఉద్దేశంతో రూ.60వేలను రాందేవ్‌రావ్ ఆస్పత్రి యాజమాన్యానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి యాజమాన్యం, డాక్టర్ ఛాయాదేవి విరాళం అందజేసిన మెరుగు సుచరితను, ఆమె కుటుంబ సభ్యులను అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థినులకు అందిస్తున్న ఉచిత వ్యాక్సిన్‌కు విరాళం అందజేస్తున్న సుచరిత, కుటుంబ సభ్యులు

మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి బండి రమేష్ దరఖాస్తు



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జ్ బండి రమేష్ శనివారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ స్థానానికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ స్థానానికి ఎంతో మంది ప్రముఖులు, వ్యాపారవేత్తలు పోటీలో ఉన్నారని ఆయన తెలిపారు. పార్టీ ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీ సిద్ధాంతాలకు, నియమ నిబంధలనకు అనుకూలంగా వ్యవహరించటం తన ప్రథమ కర్తవ్యంగా భావిస్తున్నానని తెలిపారు.

సోషల్ టాలెంట్ టెస్టు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విద్యాధికారి విజయకుమారి

కూకట్‌పల్లి: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ సౌజన్యంతో కూకట్‌పల్లి జెడ్‌పీహెచ్ఎస్ స్కూలులో సోషల్ ఫోరం మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారికి విద్యాధికారి విజయకుమారి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 50 ప్రభుత్వ పాఠశాలల నుంచి తెలుగు, ఇంగ్లిషు మీడియంలో ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సోషల్ ఒక గొప్ప సామాజిక శాస్త్రమని, దానిని చదివినట్లయితే ఏ ప్రాంతంలోనైనా సరే జీవించడానికి అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా సమాజ విలువలు నైతికత అలవడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయులు గురాచారి, రాంరెడ్డి, కిషన్, సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీనయ్య, గౌరవ అధ్యక్షులు శివాజీ, సురేందర్‌రెడ్డి, సెక్రటరీ శ్రీనివాస్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరి హక్కులను బ్యాగరి కులస్తులకే ఇవ్వాలి

పంజగుట్ట: హిందూ శ్మశానవాటికలలో కాటికాపరి వృత్తిపై సంపూర్ణ హక్కులను మాల బ్యాగరి కులస్తులకే కల్పిస్తూ జీవో ఇవ్వాలని గ్రేటర్ హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి మాల బ్యాగరి వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రధాన కార్యదర్శి టి.పద్మాకర్‌తో కలిసి ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వంలో సుందరీకరణ అనే పేరుతో కొన్ని శ్మశానవాటికలను అభివృద్ధి చేసి మహాప్రస్థానం, వైకుంఠధామం, ముక్తిఘాట్ అని పేర్లు పెట్టి టెండర్లు వేసి ప్రైవేట్ కాంట్రాక్టర్లకు, ఏజెన్సీలకు అప్పగించారని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ శ్మశానవాటికల్లో శవాల దహనం, పూడ్చిపెట్టడమే తమ వృత్తి అని ఇది తమ తాతల కాలం నుంచి చేస్తున్న పనే అని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో తమకు న్యాయం జరుగుతుందని భావిస్తున్నామని శ్మశాన వాటికలను కాంట్రాక్ట్‌లకు అప్పగించరాదన్నారు. కోశాధికారి శ్రీనివాస్‌రావు, జగన్, బాల్‌రాజ్, రమేష్, హరినాథ్, సత్యనారాయణ, రామ్‌చందర్ పాల్గొన్నారు.

విస్తృతస్థాయి సమావేశానికి తరలిన గులాబీ దళం



కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నేతృత్వంలో ర్యాలీగా తరలివెళ్తున్న బీఆర్ఎస్ నేతలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి ఓల్డ్ బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. సుమారు 500 మందితో ఓల్డ్‌బోయిన్‌పల్లి నుంచి బైక్ ర్యాలీల ద్వారా బయలుదేరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మక్కల నర్సింగ్‌రావు, ఇర్ఫాన్, మేకల హరినాథ్, బుర్రి యాదగిరి, పోచయ్య, సత్యనారాయణ, బాల్‌రాజ్, కృష్ణారెడ్డి, నాగేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



శుభాకాంక్షలు



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన జగదీశ్వర్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శనివారం శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివేకానందనగర్ కంటెస్టెడ్ కార్పొరేటర్ బాషిపాక నాగమణి యాదగిరి, సీనియర్ నాయకులు మూకయ్య, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన సత్యం శ్రీరంగం



కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ, ప్రభుత్వ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించిన మహమ్మద్ షబ్బీర్ అలీని శనివారం ఆయన కార్యాలయంలో టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రభుత్వరంగ సంస్థల్లో ఉద్యోగాలకు రాజబాట 'గేట్'



మాట్లాడుతున్న అధ్యాపకుడు త్రినాథ్

పటాన్‌చెరు టౌన్: గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) అనేది ప్రతిష్టాత్మక సంస్థలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు చదవడానికి మార్గం మాత్రమే కాదు, ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), పరిశోధనా కేంద్రాలు, ఇతర సాంకేతిక విభాగాలలో విస్తృత శ్రేణి ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తుందని హైదరాబాద్‌లోని ఏస్(ఏసీఈ) ఇంజనీరింగ్ అకాడమీ అధ్యాపకుడు త్రినాథ్ అన్నారు.గీతం విశ్వవిద్యాలయంలోని, కెరీర్ గైడెన్స్ కేంద్రం ఆధ్వర్యంలో 'ప్రభుత్వ రంగ సంస్థలలో ఉపాధి అవకాశాలు' అనే అంశంపై శనివారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు.ఇంజనీరింగ్ పట్టభద్రుల భవిష్యత్తును రూపొందించడంలో గేట్ ప్రాముఖ్యతను వివరించారు.గేట్ నుంచి మార్కులను సాధించడం ద్వారా భారతదేశంలోని ఐఐఎస్‌సీ, ఐఐటీలు, ట్రిబుల్ ఐటీలు,ఎన్ఐటీల వంటి ప్రముఖ సాంకేతిక విద్యా సంస్థలలో మాస్టర్స్ (పీజీ)ని అభ్యసించడమే గాక, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగం పొందడానికి ఉపకరిస్తుందన్నారు. మనదేశంలోని ప్రధాన సీఎస్‌యూలలో తాజా ఇంజనీరింగ్ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు పుష్కలంగా ఉన్నాయని, ఇక్కడ ప్రాథమిక అర్హత కోసం గేట్ తప్పనిసరి అని చెప్పారు. దీనికి అదనంగా, భారత రక్షణ పరిశోధన,అభివృద్ధి సంస్థ (డీఆర్డీవో), భారత అంతరిక్ష సంస్థ (ఇస్రో), బాబా అణు పరిశోధనా కేంద్రం (బార్క్) వంటి నాన్-పీఎస్ యూ కేంద్ర ప్రభుత్వ సంస్థలు కూడా గేట్ స్కోర్‌ల ఆధారంగా అభ్యర్థులను నియమించుకుంటాయని త్రినాథ్ నివరించారు. ఏస్ ఇంజనీరింగ్ అకాడమీ అందించే సేవలు,శిక్షణ, స్వల్ప వ్యవధి సర్టిఫికెట్ కోర్సులను వివరించడంతో బాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు.

కులగణనపై చట్టం తీసుకురావాలి

ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య

హిమాయత్‌నగర్: తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర అసెంబ్లీలో కులగణన కోసం చట్టం తీసుకురావాలని ఉమ్మడి ఏపీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్యగౌడ్ డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ప్రజా తెలంగాణ ఆధ్వర్యంలో బీసీ కులగణన అంశంపై మేధోమదన సదస్సు జరిగింది. సదస్సులో జస్టిస్ ఈశ్వరయ్యతో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి మాట్లాడారు. బీసీల సమగ్రమైన వివరాలను సేకరించి అన్ని కులాల స్థితిగతులను తెలుసుకొని సమాన అవకాశాలు కల్పించేందుకు దోహదపడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసే నూతన కమిటీకి సమగ్ర సర్వే చేయడానికి కావలసిన పూర్తి సమాచారాన్ని అన్ని కులాల భాగస్వామ్యం అయ్యేలా అందజేయాలన్నారు. బీసీలు రాజకీయ, పరిపాలన, స్థానిక సంస్థల్లో వాటాను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆకునూరి మురళి మాట్లాడుతూ... బీజేపీ హిందుత్వం ముసుగులో అగ్రకుల భావజాలంతో దేశాన్ని, దేశంలో ఉన్న అత్యధిక జనాభా గల బీసీలను ఎదగకుండా అణచివేస్తుందన్నారు. ప్రొఫెసర్ మురళి మనోహర్, ప్రొఫెసర్ సింహాద్రి, దేవల్ల సమ్మయ్య, ప్రొఫెసర్ సుదర్శన్, బి.వి.మురళి మనోహర్, కాల్వ మల్లయ్య, పర్వీ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలుచేయకుంటే ఉద్యమమే



మాట్లాడుతున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: గడువు లోగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేయకుంటే ప్రజల పక్షాన పోరాడేందుకు వెనుకాడబోమని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు ప్రకటించిన 100 రోజుల్లో రెండు నెలలు గడిచిపోయాయని, ఇంకా 40 రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయన్నారు. ఆ లోగా హామీలు అమలుచేయని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే రెండు హామీలను అమలుచేస్తున్నామని చేస్తున్న ప్రచారం అవాస్తవమని, కేవలం ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఒక్కటే అమలవుతుందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీ బాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, కుర్మ హేమలత తదితరులు పాల్గొన్నారు.

నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నిందితుల అరెస్టు

కంప్యూటర్, పరికరాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



మోతీనగర్: ప్రజలను మోసం చేసి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో నకిలీ 500 రూపాయలను ముద్రించి చలామణి చేస్తున్న ఇద్దరు నిందితులను బాలానగర్ ఎస్ఓటీ, అల్లాపూర్ పోలీసులు సంయుక్త ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ శ్రీపతి ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం... బోడుప్పల్, మారుతినగర్‌లో నివాసం ఉండే వనం లక్ష్మీనారాయణ (37) రియల్ ఎస్టేట్ ఏజెంట్, గచ్చిబౌలి, మసీదుబండలో నివాసం ఉండే ఎరుకల ప్రణయ్‌కుమార్ (26) ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. గతంలో వనం లక్ష్మీనారాయణ నకిలీ బంగారాన్ని తనఖా పెట్టి మోసం చేశాడు. ఇతడి మీద కేసు నమోదై ఉంది. ఆర్థిక పరిస్థితి బాగుండకపోవటంతో ప్రజలను మోసం చేసి సులభంగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నాడు.

◆ కంప్యూటర్, ప్రింటర్ల గురించిన పరిజ్ఞానం బాగా తెలిసి ఉండటంతో 500 రూపాయల నకిలీ నోట్లను ప్రింటింగ్ చేశాడు. అనంతరం నకిలీ కరెన్సీని ముద్రించిన తరువాత మరో నిందితుడు ఎరుకల ప్రణయ్ కుమార్‌తో పరిచయం చేసుకొని నకిలీ కరెన్సీ గురించి చెప్పి మార్పించేందుకు సహాయం అడిగి వాటా ఇస్తానన్నాడు. అనంతరం హైదరాబాద్ చుట్టు పక్కల ప్రాంతాల్లో ఇద్దరు కలిసి 500 నకిలీ కరెన్సీని చలామణి చేశారు.

◆ విశ్వసనీయ సమాచారం మేరకు వీరిద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వీరి వద్ద నుంచి నకిలీ నోట్లుకు సంబంధించిన ప్రింటింగ్ పరికరాలు, పేపర్లు, లామినేషన్, కట్టర్, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నారు. 810 నకిలీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. కూకట్‌పల్లి ఏసీపీ శివ భాస్కర్, అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, ఎస్సై వి.మాల్యానాయక్, సిబ్బంది, ఎస్ఓటీ బాలానగర్ పోలీసుల పర్యవేక్షణలో అరెస్టు చేసినట్లు తెలిపారు.



నకిలీ కరెన్సీని చలామణి చేస్తున్న నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కంప్యూటర్లు, పరికరాలు